చీకట్లో

శివప్రసాద్

చీకటి ఆలోచిస్తోంది ఎవరింట్లో ప్రవేశిద్దామా అని. చుట్టూ కలియజూసింది. అన్ని చోట్ల రంగు రంగుల దీపాలు మిలామిలా మెరుస్తున్నాయి. ఊహు... అక్కడకి వెళితే తనని పురుగుని చూసినట్టు చూస్తారు. తనని ఎవరూ ఖాతరు చేయరు. అదిగో! ఆ ఇంట్లోకి వెళదాం. అందులో రామశర్మ అనే డబ్బై ఏళ్ళ ముసలి మాజీ మాష్టారు గారు, అరవై ఏళ్ళు పై బడ్డ పార్వతమ్మ అనే అతని సతీ మణి ఉంటున్నారు. వారిని కంగారు పెడదాం. అటు వంటి వాళ్ళైతేనే తనకు భయపడతారు. చీకటి కాంతి కిరణాల వేగంతో ఆ ఇంట్లోకి పరుగు తీసింది.

"ఏమండీ! ఇంక ఎంతసేపు అలా కుట్టు కుంటారు? రేపు నేను కుట్టిపెడతాను ఆ పంచని ... ... చీకటి పడింది... కళ్ళకు అంత మంచిది కాదు" పార్వతమ్మ నులక మంచంలోంచి లేచే ప్రయత్నం చేస్తూ హీన స్వరంతో అంది.

"అవును కదూ! చీకటి పడింది. నాకేమీ తెలియనే లేదు! అహ పార్వతీ! నీవు పడుకో. లేవకు. లాంతరు వెలిగిస్తాను." రామశర్మ లేచి ఊడిపోబోతున్న కండువాను మొలకు గట్టిగా బిగించి కట్టాడు. పంచను ప్రక్కనే ఉన్న కుర్చీమీద వేసి పార్వతమ్మ పడుకుని ఉన్న నులక మంచం వైపు నడిచాడు.

"పార్వతీ! జ్వరం కొంచెం తగ్గినట్టుగా ఉందే?" మంచంమీదకి వంగి ఆమె నుదుటి మీద చేయి వేస్తూ రామశర్మ అన్నాడు. పార్వతమ్మకు కళ్ళలో గిరుక్కున నీళ్ళు తిరిగాయి. 'మీకు ఎంత కష్టం కలిస్తున్నానండీ' అని వాపోయింది మనసులో. పార్వతమ్మ కనుకొనల్లో నిలిచిన నీళ్ళు ఆ చీకటిలో

మంచి ముత్యాల్లా మెరుస్తున్నాయి. రామశర్మ విస్మయం చెందాడు.

"ఎందుకీ కన్నీరు పార్వతీ! నేనున్నానుగా. బాధపడకు." రామశర్మ ఆమె అరచేతిని తన చేతుల్లోకి తీసుకుని కాసేపు మృదువుగా నిమరాడు.

"ఉండు పార్వతీ! లాంతరు వెలిగించటం మరచిపోయాను. ఆ పనిచేసి వస్తాను" మంచం దగ్గరనుంచి కదిలాడు రామశర్మ. లాంతరు వెలిగించి గదిలో మధ్యగా ఉంచాడు. లాంతరు ఉండి ఉండి ఆరిపోవటానికి ప్రయత్నిస్తూ ఉంది. 'అవును! ఈ ఇంట్లో అన్నీ పాతబడిపోతున్నాయి'. రామశర్మ అనుకున్నాడు. పార్వతమ్మ ఉన్నట్టుగా లేనట్టుగా లేని చీర కొంగుని చేతిలోకి తీసుకుని కళ్ళు తుడుచుకుంటూ కనిపించింది. రామశర్మ మరల ఆమె వద్దకు వచ్చాడు కలత చెందిన మనసుతో.

"పార్వతీ! రోజూ నీవు చేసే ఈ పనులు నేను చేస్తున్నాననేగా నీకీ బాధ. ఫరవాలేదు పార్వతీ! రెండురోజుల్లో నీ జ్వరం తగ్గిపోతుంది. మరల నీవే చేద్దువుగానిలే" రామశర్మ అనునయించాడు. పార్వతమ్మకు మాటలు పెగలలేదు. భర్త చేతిని తన గుండెమీదకు తీసుకుంది, ఉప్పొంగుతున్న ప్రేమాభిమానాలతో.

"పార్వతీ! కాస్త గ్లూకోజు కలిపి ఇస్తాను" తన చేతిని ఆమె చేతిలోంచి విడిపించుకుని వంటింట్లోకి వెళ్లాడు. గ్లాసుతో నీళ్ళుతెచ్చి అందులో గ్లూకోజు కలిపాడు. గ్లాసుని ఆమెకు అందించాడు. పార్వతమ్మ లేచి కూర్చునే ప్రయత్నం చేయబోయింది. కాని అంత సత్తువ ఉన్నట్టు అనిపించలేదు. ఎంతో నీరసంగా ఉంది.

"పార్వతీ! లేచి కూర్చోవటమెందుకు. నేను ఒక్కొక్క చెంచాయే నోట్లోపోస్తాను. త్రాగుదువు గాని" మంచంలో సగం లేచి కూర్చున్న పార్వతమ్మను తిరిగి పడుకోబెట్టాడు. ఆమె నోట్లో ఒక్కొక్క చెంచాయే పోశాడు రామశర్మ. ఆమె 'ఇంక చాలు' అన్నట్టుగా చేయి ఊపింది. రామశర్మ పోయటం ఆపి గ్లాసుని మంచం కింద నేలమీదుంచి దానిపై మూతపెట్టాడు.

ఇది ఏనాటి పాపమో! తను ఎప్పుడూ ఇంతటి విశాల హృదయుడైన భర్తకి సేవలు చేస్తూ తనువు చాలించాలని ఆశపడింది. కాని ఇటువంటి పాపిష్ఠి రోజు వస్తుందని, ఈ వయసులో ఆయనకి తను ఇంత కష్టం కలిగిస్తుందని తాను ఏనాడూ ఊహించలేదు. పార్వతమ్మ కళ్ళు మరల అశ్రుపూరితాలయ్యాయి. కన్నీరు ధారగా ప్రవహించలేక ఆమె చెక్కిళ్ళపై చర్మం ఏర్పరచుకున్న ముడతల్లో క్రమక్రమంగా స్థానం సంపాయించుకుంటోంది. తనని క్షమించమన్నట్టుగా చేతులు జోడించి భర్తకి నమస్కరించింది పార్వతమ్మ.

"ఛ... ఇదేమిటి పార్వతీ! ఈమాత్రందానికి ఇంతగా బాధ ఎందుకు? ఇన్నేళ్ళుగా నీవు నాకు ఎనలేని సేవలు, పరిచర్యలు చేయలేదా... వీటితో పోలిస్తే నేను నీకు చేస్తున్నది ఏపాటిది చెప్పు! నీలాంటి భార్యకు సేవ చేయటానికి ఏ భర్తా సిగ్గుపడడు. బాధపడడు. అటువంటి అదృష్టం నాకు ఈనాటికి కలిగినందుకు ఒకప్రక్క ఎంతో సంతోషంగా ఉంది. మరోప్రక్క ఎంతో..." రామశర్మకు పెదిమలు విప్పడటంలేదు. ఆయన కళ్ళు చెమ్మగిల్లాయి. భార్య జబ్బు పడుతుందనీ, ఇలా కృశించి పోతుందనీ తను ఏనాడూ అనుకోలేదు.

"ఏమండీ వయసులో ఉన్నప్పుడు... సేవలు చేయటం వేరు. కాని ఈ వయసులో... పోనీ అబ్బా..." పార్వతమ్మ అప్రయత్నంగానే ఆ మాట అంది. కానీ ఇంక ఆ వాక్యాన్ని పూర్తిచేయలేక పోయింది. అబ్బాయి, కోడలు ఈ పరిస్థితుల్లో దగ్గరుంటే ఎంత బావుండేది! పోనీ వెళితే... పరిస్థితి వివరిస్తే... రావచ్చేమో! కాని ఈయనకి అభిమానం ఎక్కువ! తను వెళ్ళరు! ఈ విషయం ప్రస్తావనకు తెచ్చి ఆయన మనసుని నొప్పించినది అవుతుందే కాని వేరే ప్రయోజనముండదు! తమ ఏకైక సంతానం సుందరం! కనీసం రేపోమాపో రాలిపోయే స్థితిలో ఉన్న ఇప్పుడైనా నవ మాసాలు మోసి, కని వాడిని ఇంతవాడిగా చేసిన ఒక తల్లిగా వాడు తమని సాకాలని ఆశించే హక్కు లేదాతనకి!? అది దురాశ అవుతుందా!? ఎంత విచిత్రం ఈ సృష్టి! పార్వతమ్మ మనసున సమాధానం దొరకని కొన్ని ప్రశ్నలు, సందేహాలు వేధిస్తున్నాయి.

"పార్వతీ! ఒక మనిషిగా నేను, కన్నతల్లిగా నీవు అనుభవిస్తున్న క్షోభని అర్థం చేసుకోగలను. అంతకుమించి నానుండి మరేమీ ఆశించకు. నీకు అండగా నేనున్నాను పార్వతీ! నీవు అధైర్యపడకు."

ఎంతో గంభీరంగా వెలువడ్డాయి ఆ మాటలు రామశర్మ పార్వతమ్మ భుజాన్ని మృదువుగా తట్టి అక్కడనుంచి కదిలాడు. వంటింట్లోకి వెళ్ళి బియ్యం కోసం ఎసరుపెట్టాడు. కట్టెలు పొయ్యిలోపెట్టి వెలిగించాడు. అవి అంటుకునే దాకా విసరి వంటింట్లోంచి బయటికి వచ్చాడు. పార్వతమ్మ దగ్గర కూర్చుని కాసేపు ఆమె నుదుటిమీద అమృతాంజనం వ్రాశాడు. తిరిగి వంటింట్లోకి వెళ్ళాడు.

* * *

రామశర్మ జావ తయారుచేసి పార్వతమ్మతో త్రాగించాడు. తాను భోజనం ముగించి వంటింట్లోంచి బయటికి వచ్చాడు. లాంతరు కాంతిని తగ్గించాడు. బల్ల క్రింద ఉన్న చాపను తీసి పార్వతమ్మ పడుకుని ఉన్న మంచం దగ్గరగా పరచాడు. కుర్చీమీద వేసిన పంచను కట్టుకున్నాడు. కండువాని మడతలు చుట్టి తలవైపు చాప మీద ఉంచి మేనివాల్చాడు.

రామశర్మ మెదడు పుట్టినప్పటినుంచి ఆలోచిస్తూ ఉంది. ఇప్పటికీ ఆలోచిస్తూనే ఉంది అవిరామంగా! కాని గతంలో కలిగిన ఆలోచనలకి వర్తమానంలోని ఆలోచనలకి ఎంతో తేడా. ఇప్పటికీ ఆలోచనల్లో ఏదో క్రొత్తదనం! బహుశ ఈ క్రొత్తదనం గతానికి వర్తమానానికి మధ్యగల వ్యత్యాసంలోంచి పుట్టినదేనేమో! తను పుట్టాక డబ్బై క్యాలెండర్లు మారాయి. అన్నింటిలోనూ అవే అంకెలు! ఆ అంకెలు రకరకాలుగా కలిసి తనకు తెచ్చిన సమస్యలూ, నేర్పిన 'లెక్కలు' ఎన్నో... ఎన్నెన్నో... ఆ అంకెలు ఎప్పటికప్పుడు ఏవేవో క్రొత్త క్రొత్త పాఠాలు తనకి నేర్పాలని తాపత్రయ పడుతూనే ఉన్నాయి.

తనకి అప్పుడే డబ్బై సంవత్సరాలు నిండాయి! చూస్తూచూస్తూ ఉండగానే తను వృద్ధాప్యంలోకి అడుగుపెట్టేశాడు. బాల్యం, యవ్వనం మొదలైన దశలన్నీ క్రొవ్వొత్తుల్లా కరిగిపోయాయి. ఆ దశల వంతెనలన్నీ తను తనకి తెలియకుండానే దాటుకుని వచ్చేశాడు. ఆ వైపు తిరిగి చూస్తే కలిగే అనుభూతి ఆశ్చర్యం? వింతగాఅనిపిస్తుంది తనకి ఈ జీవన యాత్రలో ఇంక ఆఖరి మజిలీ మిగిలి ఉందన్న నిజం గుర్తుకొచ్చినప్పుడల్లా!

రామశర్మ ఇంటి పైకప్పు వంక చూశాడు.







కుర్చీకేసి చూశాడు. నులకమంచం వైపు చూశాడు. తను పడుకుని ఉన్న చాపకేసి, కట్టుకున్న పంచకేసి, తన శరీరంకేసి పదే పదే చూసాడు. అవును! అన్నీ పాతబడి పోయాయి. ఇంటి పైకప్పుకి బూజు పట్టి ఉంది. కుర్చీకోడు విరిగిపోయింది. మంచానికి ఉన్న తాడు తెగిపోతూ ఉంది. చాప చిరిగిపోయింది. పంచకి చిల్లులు పడ్డాయి. అవును! తను కూడా పాత బడిపోయాడు. కాని... ఈ ప్రాణం లేని వస్తువు లన్నీ ఇంకా ఆరాటు పడుతూనే ఉన్నాయి తనతో కలసి జీవించాలనీ, తనతోపాటే తాముకూడా అంత రించిపోవాలనీ. తన సంతానమంతా ఇదేనా ... ఈ ప్రాణంలేని జీవులేనా? ఇవి చూపిస్తున్న ఆప్యాయతానురాగాలు మనిషిగా పుట్టిన తన ...!

రామశర్మ మనసులో కాలం వ్రాస్తున్న స్వీయ చరిత్రా గ్రంథంలో కొన్ని అనుభవాల పుటల్ని అతని మెదడు చదవటానికి ప్రయత్నించింది.

పన్నెండేళ్ళ క్రితం ... తాను స్కూలు మాష్టరుగా రిటైరయినరోజు అది. ఆ రోజు తన హృదయంలో ఏదో గుబులు, మరింకేదో దిగులు. ఇన్నేళ్ళుగా ఒక వ్యవస్థలో పనిచేశాడు తను. ఈనాడు అదే వ్యవస్థ 'బాబూ! నీ వయసైపోయింది. ఇంక నీతో పనిలేదు' అన్నట్టుగా తనని ఒక అశక్తుడిగా మార్చటానికి ప్రయత్నిస్తూ తనని వెళ్ళిపొమ్మంటోంది. రేపటినుంచి ఇంక ఇంటిదగ్గరే ఉండాలి. ఇక్కడికి రానక్కరలేదు. మనసులో ఎలాగో ఉంది. బాధగా ఉంది. బరువెక్కిన హృదయంతో ఇంటికి వచ్చాడు తను.

కొడుకు, కోడలు, పిల్లలు ఇద్దరు ఎక్కడికో ప్రయాణమవుతున్నారు. పార్వతమ్మ కళ్ళల్లో నీరు. తనని చూడగానే ఒక్కుదుటున లేచివచ్చి భోరుమని ఏడ్చింది. తనకి అంతకు పూర్వం ఏం జరిగిందో అప్పుడు ఏం జరుగుతోందో ఏమీ బోధపడలేదు.

"ఏమిటి పార్వతీ! ఏమయ్యింది? ఎందుకలా ఏడుస్తున్నావ్?" తను పార్వతిని ఆత్రుతగా అడిగాడు.

"ఏమండీ! వీళ్ళు వెళ్ళిపోతారుట!" వచ్చే దుఃఖాన్ని ఆపుకుంటూ సమాధాన మివ్వగలిగింది పార్వతి.

"ఎక్కడికి?" తను విస్తుపోతూ అడిగాడు.

ద క్షి ణ

"వీళ్ళు ఈ ఊర్లోనే వేరే కాపురం పెట్టుకుంటారుట!"

"ఆఁ" తను దిగ్భ్రాంతి చెందాడు. నమ్మలేక పోయాడు.

"బాబూ సుందరం! ఏమిటి బాబూ! ఇది నిజమేనా?"

సుందరం ఏమీ మాట్లాడలేదు. మరో ప్రక్కకి చూస్తూ ఉండిపోయాడు. తను కోడలి వంక చూశాడు ప్రశ్నార్థకంగా.

"ఏమీ మాట్లాడరేమిటండీ, చెప్పండి" కోడలు గద్దించింది సుందరాన్ని. కోడలి గొంతులో అంతటి కాఠిన్యత ధ్వనించగలదని మొదటిసారిగా తెలుసుకున్నాడు. ఖిన్నవదనుడై నిలబడ్డాడు తను.

"నాన్నగారు! ఇంక ఇక్కడ ఉండదలుచుకోలేదు. పిల్లల స్కూలుకి, నా ఆఫీసుకి చాలా కష్టమవుతోంది రోజు. అందుకే వీటన్నింటికి వీలుగా నా ఆఫీసుకి, పిల్లల స్కూలుకి దగ్గరగా ఉన్న పోర్షన్ ఒకటి తీసుకున్నాను."

ఆస్పత్రిలో పాఠాలు!

పశ్చిమ జర్మనీలోని న్యూరెంబర్గ్ ఆస్పత్రిలో వైద్యం చేయడమేగాక, పాఠాలు కూడా చెబుతున్నారు. ఆస్పత్రిలో వైద్యం కోసం చేరిన చిన్నపిల్లలు చదువుల్లో వెనుకబడకూడదనే వుద్దేశ్యంతో యీ కార్యక్రమాన్ని చేపట్టారు. అంతేగాక, ఆస్పత్రిలో ఎక్కువ కాలం వుండటంవలన ఏర్పడే విసుగును యీ విధంగా తొలగింపవచ్చునని భావిస్తున్నారు. ఇది ఏ విధంగానూ చికిత్సకు అడ్డుకాదనీ, చిన్నపిల్లలకు తగినంత పని లేకపోవడం పెద్ద లోపం కాగలదని ఆ డాక్టర్లు అంటున్నారు. చిన్నపిల్లలకు లక్ష్యసాధన, దానినందుకోడానికి ప్రోత్సాహకరమైన బహుమతులు వుండాలని వీరి వుద్దేశ్యం. ఈ కార్యక్రమాన్ని 1979లో ప్రారంభించారు.

"పోనీ ఈ ఇల్లు అద్దెకి ఇచ్చేస్తాను. మేమిద్దరం కూడ నీతోపాటే వచ్చేస్తాం. బాబూ సుందరం! నీవు దగ్గర లేకుండా మేము జీవించగలమా నాయనా! ఈ వయసులో మమ్మల్ని ఒంటరిగా వదలి వెళ్ళిపోవటం ధర్మమా బాబూ ఆలోచించు మరొక్కసారి!" కొడుకు తమ సున్నిత హృదయాలపై సమ్మెట దెబ్బలు కొడుతుంటే అలా 'చిత్రవధ చేయొద్ద'ని జన్మదాతలు చేసే చివరి ప్రార్థన అది! ఆనాడు తల్లి గర్భం నుంచి బయట పడాలని తహ తహ. ఈనాడు ఈ ఇంటినుంచి బయటపడాలని తహ తహ. ఏమిటో ఈ తహ తహ ఎక్కడికో 'ఈ' మనిషి 'పయనం'!

"అక్కడ చాలా ఇరుకుగా ఉంటుంది నాన్నగారు! రెండు గదులే తీసుకున్నాను."

"ఇక్కడ మన ఇంటికి ఉన్నవికూడా రెండు గదులే కదా బాబూ!" ఈ సృష్టిలోని మనుషులందరి హృదయాలు ఇరుకుగా అయిననాడు ఇంతటి విశాల ప్రపంచంలోనూ ఒక్క సున్నిత మనస్కుడు జీవించటానికి పాదం మోపేంత స్థలం కూడా దొరకదేమో!

"నాన్నగారు! లాభనష్టాలన్నీ బేరీజు వేసుకునే ఈ నిర్ణయం తీసుకున్నాను. ఇంక మాకు అడ్డు పడకండి" అడ్డుపడేందుకు తానెవరు? ఎందరో కొడుకులు! ఎందరో తండ్రులు! వారందరిలోను ఒక కొడుకుకి తానొక తండ్రి! ఎందరో పుట్టారు. మరింకెంతమందికో జన్మల నిచ్చారు. అందరూ పోతూనే ఉన్నారు. అన్నీ కదలిపోతూనే ఉన్నాయి. ఇందులో ఎవరు ఎవరిని ఆపగలిగి ఉండినా ఈ సృష్టి ఇలాగే ఉండేదో... ఇంకెలాగో ఉండేదో... అయినా తన పూర్వీకులు చేయని పనిని చేసే హక్కు తనకెక్కడిది? కదలిపోనీ ఈ సృష్టిని! అందుకే మారు మాట్లాడలేదు తను. వెళ్ళిపోయాడు తన ఒక్కగానొక్క కొడుకు!

తను ఆనాడు ఆ విధంగా సరిపెట్టుకున్నాడు. కాని... రోజులు గడుస్తున్నకొద్ది, వయసు ముదురుతున్నకొద్దీ ఆయుష్షు క్షీణిస్తున్నకొద్ది తనలో ఏదో అశాంతి, అసంతృప్తి, బాధ చోటు చేసుకుంటున్నాయి.

తన బాల్యమిత్రులు, సహోద్యోగుల్లో కొంతమంది చనిపోయారు. ఇంకా కొంతమంది బ్రతికే





ఉన్నారు. మరి తన జీవితం వారి జీవితాల్లా ఉందా! వాళ్ళలో చాలామంది కొడుకులు, కోడళ్ళ దగ్గరే నివసిస్తున్నారు. అప్పుడప్పుడు కూతుళ్ళ దగ్గరికి వెళ్ళివస్తూ ఉంటారు. మనవళ్ళు మనవరాండ్రతో ఆడుకుంటున్నారు. పండగలకి కొడుకులు కూతుళ్ళు కానుకలు సమర్పించుకుంటూ ఉంటారు. ఓహ్! మరి తన విషయం... తన కలాంటి కొడుకులతో, కోడళ్ళతో, కూతుళ్ళతో పనిలేదా...వాళ్ళ ప్రేమాను రాగాలు తనకి అవసరంలేదా? తనకి మనవళ్ళు మనవరాండ్రచే 'తాతయ్యా' అని పిలిపించుకోవాలనీ, వారితో ఆడుకోవాలని ఆశపడే హక్కు లేదా? తన విషయంలో అలా ఆశించడం నేరమవుతుందా లేక ప్రకృతి విరుద్ధమవుతుందా? ఈ జీవం లేని వస్తువుల్లోనే తను అందర్నీ చూసుకుంటూ వీటితోనే ఆడుకుంటూ కాలం వెళ్ళబుచ్చాలా?

తను ఎంతోమందికి అక్షరాభ్యాసం చేయించాడు. పాఠాలు నేర్పాడు. ఎందరో విద్యార్థులకు తను గురువుగా మసిలాడు. వారి తల్లితండ్రుల మన్ననలు పొందాడు. తమ కొడుకుల్ని చక్కటి విద్యార్థులుగా తీర్చిదిద్దిన తన కృషిని కొనియాడారు. ఆ క్షణాలు ఒక గురువుగా తానెన్నడూ మరువలేనివి. కాని... కాని ఆ శిష్యులలో కొందరు తనకే పాఠాలు నేర్పబోయిన ఆ క్షణాన... తను గర్వించాలా? గర్హించాలా? ఆనందపడాలా? ఆక్రోశించాలా? విద్యార్థులందరూ ఒక గురువుకి ప్రియశిష్యులు కాలేరు. కాని తన ప్రియశిష్యులలో ముఖ్యుడైన ఒకడు రాసిన ఉత్తరానికి తను ఏం సమాధాన మివ్వాలి! ఒకప్పటి తన స్టూడెంటు ఇంత వాడయ్యాడని సంతోషించాలా? బాధపడాలా? సమస్యలు ఎదురవ్వడం వాటిని పరిష్కరించడం క్రొత్తేమీకాదు రామశర్మకి. నాలుగురోజుల క్రితం తన శిష్యుడు వ్రాసిన ఉత్తరాన్ని మరల చదవా లనిపించింది. చాపమీదినుంచి లేచి కూర్చున్నాడు రామశర్మ. పార్వతమ్మ కేసి చూశాడు. ఆమె నిద్రపోతూ ఉంది. రామశర్మ లేచి బల్లమీద ఉన్న పెట్టె తెరిచాడు. అందులో అడుగున దాచి ఉంచిన ఉత్తరాన్ని బయటికి తీశాడు. లాంతరు కాంతిని హెచ్చించాడు. పార్వతమ్మ నిద్రకి భంగం కలగకుండా ఉండేందుకు లాంతరుకి అడ్డుగా కూర్చున్నాడు.

ద క్షి ణ

ఉత్తరం చదవటం ప్రారంభించాడు.

నాన్నగారికి,

నమస్సులు! మీరు, అమ్మ కులాసాగ ఉన్నట్టు తలుస్తాను. మీ వద్దనుంచి ఉత్తరాలు వచ్చి చాలా రోజులైంది. కారణం తెలియదు. ఇక్కడ మేమంతా కులాసా.

మీ మనవరాలు లలిత రజస్వల అయి అప్పుడే మూడు సంవత్సరాలు కావస్తోంది. ఈ విషయం మీకు అప్పుడే తెలియపరిచాము. గుర్తు ఉండే ఉంటుంది. దాని వివాహం చేయాలని మీ కోడలు తొందరపడుతోంది. మంచి సంబంధం చూసి వివాహం చేయాలనుకుంటున్నాను. ప్రస్తుతం నాకు డబ్బు అవసరం! ఆ ఇంటిని అమ్మేయండి! మీరిద్దరూ నాదగ్గరే వచ్చి ఉండొచ్చు. పరిస్థితి అర్థం చేసుకుంటారని ఆశిస్తూ

ఇట్లు,
మీ కుమారుడు,
సుందరం.

బాబూ! సుందరం! ఎంతోమందిని, ఎన్నో విషయాలిని అర్థం చేసుకుంటూనే ఉన్నాను. ఇన్నేళ్ళ నుంచి. నిన్ను కూడ అర్థం చేసుకునే శక్తి నాకింకా ఉందనే అనుకుంటున్నాను. బాబూ! ఏం సమాధాన మివ్వమంటావ్? నేనింతవరకు ఎన్నో గురుదక్షిణలు అందుకున్నాను. కాని ఈ రోజు నేనే ఒక శిష్యుడికి దక్షిణ ఇవ్వబోతున్నాను. ఎందుకంటే ఆ శిష్యుడివి నువ్వే కాబట్టి! నేను విద్యా బోధనలో ఎన్నో నూతన ఒరవడులు ప్రవేశపెట్టాను. ఈ శిష్యదక్షిణ అనే ఒరవడిని ప్రవేశపెట్టిన ఘనత కూడా నాకే దక్కాలి బాబూ! నాకే దక్కాలి! నేనిచ్చే 'దక్షిణ' స్వీకరిస్తావని ఆశిస్తున్నాను. రామశర్మ కళ్ళు చెమ్మ గిల్లాయి. ఉత్తరాన్ని మడిచి తిరిగి పెట్టెలో పెట్టాడు. చాపమీద మేను వాల్చి నిద్రకుపక్ర మించాడు.

*   *   *

"టెలిగ్రామ్... టెలిగ్రామ్."

సుందరం హడావుడిగా బయటికివచ్చి కంగారుగా టెలిగ్రామ్ అందుకున్నాడు.

"సుందరం! నీ తల్లితండ్రులు మరణించారు. వెంటనే బయల్దేరి రావలెను"

ఇట్లు
రామశర్మ
పార్వతమ్మ

సుందరం భ్రుకుటిముకుళించుకుంది. వింతగా ఉంది, విడ్డూరంగా ఉంది. తాము మరణించినట్లు తన తల్లిదండ్రులు టెలిగ్రామ్ ఇవ్వడమా! తనని ఆట పట్టించేందుకు ఎవరైనా ఈ టెలిగ్రామ్ ఇచ్చి ఉండచ్చు... ఆ టెలిగ్రాం నిజం కాదని నమ్మ టానికి ప్రయత్నించాడు సుందరం. కాని అతనిలో ఏదో మూల ఏదో అనుమానం పీడిస్తోంది. అయినా తను తల్లి తండ్రుల్ని చూసి చాలా రోజులైంది. ఒక్కసారి చూసివస్తే మంచిది. తను కోరిన కోరిక నెరవేరటం సులభతరం కూడా అవుతుంది అని అనుకున్నాడు.

*   *   *

కోకిలమ్మ గుండెకోత

ఎందరో మహాకవులు
కవితలల్లుతున్నారు
కోకిలమ్మ పాటమీద
తియ్యని తన గొంతుమీద

కానీ —

అవతారం చాలించి
గోపాలుడు వెళ్లిపోగా
మరచిపోయి వెళ్లాడని
దిగులుజెంది అతని మురళి

కోకిలమ్మ రూపంలో
అతని కోసం గాలిస్తూ
ఏడుస్తూ తిరుగుతోందని
ఎవ్వరికీ తెలియదాయె

కోకిలమ్మ గుండెకోత
కడకు కమ్మని పాటాయె!

— టి. ఎస్. ఎస్. రంగనాథ్

ఎన్నో రోజులు... కాదు... ఎన్నో సంవత్సరాల తరువాత సుందరం తన తల్లిదండ్రులుంటున్న ఇంటికి చేరుకున్నాడు. ఇంటి ముందు కోలాహలంగా ఉంది. ఎవరెవరో ఉన్నారు. ఎవరిన్నీ గుర్తుపట్టలేక పోతున్నాడు సుందరం. అక్కడ ఉన్న వాళ్ళంతా 'ఎవరీ మనిషి' అన్నట్టుగా సుందరంవైపు చూడసాగారు. సుందరానికి వారందర్నీ చూస్తుంటే జరగరానిదేదో జరిగిపోయిందేమోనన్న భయం కలుగుతోంది. వారందర్నీ తప్పించుకుని ఇంట్లోకి వెళ్ళబోయాడు.

"ఎవరండీ మీరు ?" ఎవరో ఒకాయన ప్రశ్నించాడు.

సుంధరం ఆగి "నేను రామశర్మగారి కొడుకునండి !" అని సమాధానమిచ్చాడు.

"అలాగా ! మీరేనా ! మీ కోసమే ఎదురు చూస్తున్నాం ! ఇదుగో ! ఈ ఉత్తరం మీ కిమ్మని మీ తండ్రిగారు చెప్పారు."

"అసలేమైందండి ? వారు ఎక్కడికి వెళ్ళారు ?" సుందరం ఉత్తరం అందుకుంటూ కంగారుతో ప్రశ్నించాడు.

"వారు లోపలే ఉన్నారు."

"అలాగా ..." అంటూ సుందరం లోపలికి వెళ్ళబోయాడు.

"ఉహు ... మీరు లోపలికి వెళ్ళటానికి కుదరదు. ఈ ఉత్తరం చదివాక మాత్రమే మీరు ఇంట్లోకి వెళ్ళి వారిని చూడవచ్చు. ఇది మీ తండ్రిగారి కోరిక" అంటూ ఒక మధ్య వయస్కుడు సుందరం ప్రయత్నాన్ని ఆటంకపరిచాడు.

ద క్షి ణ

సుందరానికి అంతా ఆశ్చర్యంగా ఉంది. అయితే తనని ఇక్కడికి రప్పించేందుకే తండ్రి టెలిగ్రావ్ ఇచ్చాడన్నమాట ! మరి ఈ ఉత్తరం చదివాకే లోనికి రమ్మని కోరటమేమిటి !? సుందరానికి ఏమీ పాలుపోవటంలేదు. ఉత్తరం మడత విప్పి చదవటం ప్రారంభించాడు.

బాబూ సుందరం !

నీ ఉత్తరం అందినది. లలిత వివాహం తలపెట్టినందుకు ఎంతో సంతోషించాము. ఈ జీవిత ప్రయాణంలో మేమిద్దరమూ చాలా అలసిపోయాం. అందుకే ఇక ఈ ఇంటితో మాకు పనిలేదు. ఈ ఇల్లు నీ పేర మీద వ్రాసి కాగితాలు పెట్లో ఉంచినాను. ఇల్లు అమ్మి నీ కూతురి వివాహం జరిపించగలవు.

బాబూ ! నీకు ఇప్పుడే టెలిగ్రాం ఇచ్చాను. నీవు వచ్చేటప్పటికి మా ప్రాణాలు వాయులీనమై ఉంటాయి. మేము అకస్మాత్తుగా నిన్ను విడిచి వెళ్ళిపోతున్నామని బాధపడకు. తిరిగి నీకూతురు కడుపున బుట్టి నిన్ను 'తాతయ్య' అని పిలుద్దామన్న ఆశతో ఈ లోకాన్ని విడిచి వెళ్ళిపోతున్నాం. మేము నోచుకోని అదృష్టాన్ని కనీసం నీకైనా కలుగ చేద్దామనే సదుద్దేశంతో ఈ పనిచేశాము.'

నీకైనా నీ కొడుకులతో, కోడళ్ళతో, మనవళ్ళతో మనవరాండ్రలతో కలిసి ఉండే అవకాశం, వారి ఆదరాభిమానాలు లభించే భాగ్యం కలగ జేయాలని కోరుకుంటూ తిరిగి నీకు మనవళ్ళుగా జన్మించే ప్రయత్నంలో ఈ తనువులు చాలిస్తున్నాం.

బాబూ సుందరం ! ఒక్కకోరిక... చివరి కోరిక ! తీరుస్తావని ఆశిస్తున్నాము. మాకు తలకొరివి పెట్టేందుకు నీకు అభ్యంతర ముండబోదని విశ్వసిస్తున్నాము. అలా చేసే పక్షంలోనే నీవు మా శవాల్ని చూడగలవు. ఈ ఉత్తరం చదివాక నీ కిష్టమయిన పక్షంలోనే నిన్ను ఇంట్లోకి రానిచ్చి మా దేహాల్ని చూసే అవకాశం కల్పించమని మరో కాగితంలో వ్రాసి ఉంచాము. అది ఇక్కడి వాళ్ళు చదివే ఉంటారు. మాకోర్కెను మన్నిస్తావని ఆశిస్తూ సెలవు తీసుకుంటున్నాము.

ఇట్లు
నీ తల్లిదండ్రులు

సుందరం ఉత్తరం చదవటం పూర్తిచేశాడు. విద్యుద్ఘాతం తగిలినట్టయింది. "నాన్నా! నీవు ఎన్నో పాఠాలు నేర్పావు. కాని ఇంతటి కఠినమైన పాఠాన్ని నేర్పుతావని, నేర్పగలవని అనుకోలేదు.

నా పాపానికి ప్రాయశ్చిత్తంలేదు. నన్ను క్షమించండి నాన్నా ! క్షమించండి. నాలో మీరు వెలిగించిన ఈ జ్ఞాన జ్యోతిని మీకు తలకొరివి పెట్టటానికి రావల్సివస్తున్నందుకు నన్నుక్షమించండి. తల్లిదండ్రులారా ! క్షమించండి." సుందరం కన్నీరు మున్నీరుగా ఏడుస్తున్నాడు. మనిషి విలువ తెలిసేది, గ్రహించేది ఆ మనిషి పోయాకనే !

చీకటి ఆ కన్నీటి వెనుక వెలుగుతున్న 'జ్యోతి'ని చూసి కంగారుపడింది. భయంతో దౌడుతీసింది.★

ఆంధ్రుల అభిమాన దిన పత్రిక

ఆంధ్రపత్రిక

హైదరాబాద్, విజయవాడలనుండి వెలువడుతున్నది!

ఇప్పుడు ఎన్నో కొత్త సంచలనాత్మక ఉత్తేజకరమైన శీర్షికలతో తాజా వార్తలతో ముందుకన్నా త్వరగా పాఠకులను చేరుతున్నది!

హైద్రాబాద్ సంచికలో "వనితల సమస్యలు"తో పాటు విజయవాడ సంచికలో "మహిళా వాణి" మహిళలకు వ్యాస రచనావకాశాలు

ఈ శీర్షికలు మన మహిళల భావ ప్రకటనకి, రచనా పాటవానికి మంచి వేదికలుగా రాణిస్తున్నాయి।

ఈ శీర్షికలో మీరు కూడా పాల్గొనవచ్చును

ఇంకా

★ మన సినిమాలు ★ సినిమా రంగం ★ మద్రాసు సినిమా ★ విజయవాడ, సినిమా విశేషాలు ★ విద్యార్థుల ఏకైక వేదిక విద్యా రంగం ★ డాక్టర్ కబుర్లు ★ రామాయణ భాగవతాల ★ కలైడో స్కోప్ ★ వింత యదార్థాలు ★ వ్యూమెన్ కార్టూన్‌లు ★ యింకా దేవాలయాలు మొదలు అంతర్జాతీయ, దేశీయ రాజకీయాలమీద వ్యాసాలు, చిత్రాలు, వాక్చిత్రాలు...స్థలాభావంచేత యిక్కడ అవన్నీ చెప్పలేం గాని

అబాల గోపాలానికి యీ పత్రిక అభిమాన పత్రిక అని ఒక్క కాపీ "ఇప్పుడు" కొని చూడండి! మీకే తెలుస్తుంది !!

8 పుటలు । వెల : 50 పైసలు

వివరాలకు మా ఏజెంట్‌ని గాని, నేరుగా మా కార్యాలయాన్నిగాని సంప్రదించండి !